సాక్షి
వికారాబాద్
గురువారం ♦ 5 ♦ జూన్ ♦ 2025



బడిబాటకు సన్నద్ధం
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా విద్యాశాఖ బడిబాట కార్యక్రమానికి సిద్ధమైంది. 10లో▸



పేదలందరికీ ఇల్లు
పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. 10లో▸



పసుపు భలే బాగు
పసుపు పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ధరలు బాగుండటంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. 11లో▸

జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్

వికారాబాద్: వానాకాలం సీజన్‌లో పంటల సాగు, విత్తనాల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ఎరువుల వినియోగం తదితర సందేహాలు తీర్చుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డితో ఈనెల 6న ఉదయం 10నుంచి 11:30 గంటల వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు ఆయనతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





తేదీ : 06-06-2025

సమయం : ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :

8977755890, 9010299041

న్యూస్‌రీల్

'భూ భారతి'ని సద్వినియోగం చేసుకోండి
సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఉమాశంకర్ ప్రసాద్ తదితరులు

దౌల్తాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని నందారం గ్రామంలో నిర్వహించిన భూభారతి సదస్సును ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు స్వీకరించారని తహసీల్దారును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు భూ సమస్యలకు సంబంధించి తగిన ఆధారాలతో గ్రామసభలో దరఖాస్తు చేసుకుంటే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు గాయత్రి, డీటీ చాంద్‌పాషా, నాయకులు రాజశేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి
డీఎంహెచ్‌ఓ వెంకటరవణ



లక్ష్మిని సన్మానించిన వైద్యాధికారులు

ధారూరు: విధి నిర్వహణలో మనం చేసిన సేవలే గుర్తింపునిస్తాయని డీఎంహెచ్‌ఓ వెంకటరవణ అన్నారు. బుధవారం మండలంలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సూపర్‌వైజర్ లక్ష్మికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవలు చేసే మనల్ని ప్రజలు దైవంతో సమానంగా భావిస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయరాం, నాగసమందర్ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ మేఘన, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రీతమ్, ల్యాబ్ టెక్నీషియన్ ఉమ, ధారూరు, నాగసమందర్ పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

యాలాల: నాణ్యమైన విత్తనాలతో మంచి దిగుబడి వచ్చి రైతులకు లాభం చేకూరుతుందని అగ్రికల్చర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీతా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు పంటల సాగుపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం వరి, జొన్న, కంది విత్తనాలను పరిశోధన నిమిత్తం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ధారూరులో నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణం

ఆటకెక్కిన మైదానాలు!
తెలంగాణ క్రీడా ప్రాంగణాల్లో కానరాని అభివృద్ధి

- జిల్లాలోని అన్ని జీపీల్లో ఆట స్థలాలు
- క్రీడా పరికరాలు, వసతులు కల్పించని వైనం
- నిర్వహణ లేక పిచ్చి మొక్కలతో నిండిన మైదానాలు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

వికారాబాద్: జిల్లాలోని తెలంగాణ క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మూడేళ్ల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. స్థలం కేటాయించి నామమాత్రంగా చదును చేయించి బోర్డుల ఏర్పాటుతో సరిపెట్టింది. క్రీడాపరికరాలు, మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. క్రీడా మైదానాల కోసం అప్పట్లో తహసీల్దార్లు నానా ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల స్థల వివాదాలు తలెత్తడంతో వాటిని అధిగమించి భూమి కేటాయించారు. ప్రస్తుతం వారి శ్రమ వృథా అయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు అనేక మంది ఉన్నారు. వారికి క్రీడా పరికరాలు, ఆత్మరక్షణ కిట్లు, బూట్లు వంటివి సరఫరా చేయలేదు. క్రీడా మైదానాలు ఉన్నా వాటి నిర్వహణను గాలికొదిలేశారు. ప్రస్తుతం చాలా ప్రాంగణాలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. మరి కొన్ని చోట్ల రాళ్లు, గుట్టలు ఉండటంతో క్రీడలకు అనుకూలంగా లేవు.

ప్రతి గ్రామ పంచాయతీలో..

జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి చోటా ఒకటి చొప్పున క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఒక్కో జీపీలో 2వేల చదరపు గజాలు లేకుంటే 20 గుంటలకు తగ్గకుండా భూమిని కేటాయించారు. ఇందుకోసం ప్రభుత్వ, ఫారెస్టు భూములను సేకరించారు. ప్రభుత్వ భూమి లేనిచోట జీపీల్లో లేఅవుట్లు చేస్తే వాటి ద్వారా సామాజిక అవసరాల కింద ఇచ్చే 10 శాతం భూమిని క్రీడా ప్రాంగణాలకు కేటాయించేందురే వీలు కల్పించారు. ఇన్ని ఇబ్బందులు పడి అధికారులు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాలు సమకూర్చారు. అయితే మౌలిక వసతులు, పరికరాలు సమకూర్చకపోవడం,కీడా ప్రాంగణాల నిర్వహణను గాలికి వదిలేయడంతో నేడు అవి నిరుపయోగంగా మారాయి.

కనీసం మూడెకరాలు ఉండాలి

గత ప్రభుత్వం క్రీడలకు అవసరమైన మేర స్థలాలు కేటాయించలేదని క్రీడాకారులు అంటున్నారు. 2వేల చదరపు గజాలు లేకుంటే 20 గుంటల భూమి క్రికెట్‌కు సరిపోదని వారు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది యువకులు క్రికెట్ తోపాటు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ తదితర ఆటలు ఆడుతుంటారు. ప్రస్తుతం ఉన్న స్థలంలో ఒక్క ఆట ఆడుకోవడానికి మాత్రమే అనుకూలంగా ఉంటుంది. మరో క్రీడ ఆడాలంటే ఇబ్బందులు ఎదురవుతాయి. కనీసం మూడు ఎకరాల స్థలం ఉంటే క్రికెట్‌కు అనుకూలంగా ఉంటుందని యువకులు అంటున్నారు. ప్రతి గ్రామంలో ఎక్కువ మంది క్రికెట్టే ఆడతారని తెలిపారు. ఒకే చోట మూడు ఎకరాల స్థలం అందుబాటులో లేకుంటే రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక చోట క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది. ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపాలని, అలాగే పరికరాలు, వసతులు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు. క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పగించి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పలువురు అభిప్రాయ పడ్డారు.

విద్యార్థుల సంఖ్య పెరగాలి



అధికారులతో కలిసి జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- రేపటి నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్ నుంచి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలన్నారు. గ్రామాల్లోని బాలబాలికలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బడిబయట పిల్లలు ఉండరాదన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. సర్కారు బడుల్లోని వసతులు, నాణ్యమైన బోధనను ప్రజలకు వివరించాలని తెలిపారు. పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పాఠశాలలకు చేర్చామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రెండో విడతలో ఇళ్లు మంజూరైన వారు పనులు చేపట్టేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అర్హులకు పెన్షన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఈఓ రేణుకాదేవి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఏపీఎంలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రిన్సిపళ్లు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

బొంరాస్‌పేట: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మండలంలోని రేగడిమైలారంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 20 వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 14వ తేదీలోపు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం నాగిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. బొంరాస్‌పేట రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీపై ఆరా తీశారు. తదనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఎస్‌వో మోహన్‌బాబు, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

అధిక యూరియాతో అనర్థం

- సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి
- వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిమళ, డాక్టర్ శేఖర్

పరిగి: పంటల సాగులో రైతులు అధికంగా యూరియా వాడుతున్నారని, దీని వల్ల ఎటాంటి ప్రయోజనం లేకపోగా భూ సారం దెబ్బతింటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిమళ, డాక్టర్ శేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని సైదుపల్లి రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు అవసరానికి మించి యూరియా వాడుతున్నారని, దాన్ని తగ్గించాలని సూచించారు. సేంద్రియ సాగుపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేస్తే తప్పని సరిగా రశీదు తీసుకోవాలన్నారు. పంట కాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రపరచుకోవాలని సూచించారు. ఒక వేళ పంట దెబ్బతింటే నష్ట పరిహారం పొందేందుకు రశీదులు ఉపయోగపడతాయన్నారు. వరి సాగుకు నీటిని ఎక్కువగా వాడకూరాదని, రెండు, మూడు రోజులకు ఒక్కసారి పొలానికి నీరు పెడితే సరిపోతుందని తెలిపారు. పంట మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. పప్పు దినుసుల దిగుబడి భారీగా తగ్గిపోయిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పరిగి వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి కుమారి, మండల వ్యవసాయ అధికారి రజిత, ఏఈఓ ప్రసిల్లా, పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్, సైదుపల్లి ఇందిరమ్మ కమిటీ సభ్యులు గణేష్, గోపాల్ రెడ్డి, అన్వర్, నర్సింలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

- రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

పరిగి: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం తల్లిదండ్రులను కోరారు. బుధవారం పరిగి పట్టణంలో ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రచార జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని అన్నారు. చదువు విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని సూచించారు. టీఎస్‌టీయూఎఫ్ పోరాట ఫలితమే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మోయిన్ ఖాన్, జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, కృష్ణవేణి, నీలమ్మ, ముత్యప్ప, రత్నం, దశరథ్, మేఘ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచార జాత కార్యక్రమంలో వెంకటరత్నం తదితరులు

నిరీక్షణకు మోక్షం..

- బషీరాబాద్‌లో ఎట్టకేలకు ఇంటర్ తరగతులు
- 8 మంది ఫ్యాకల్టీని నియమించిన ప్రభుత్వం
- కళాశాలకు భవనం కేటాయింపు
- ఊపందుకున్న అడ్మిషన్లు



కళాశాల కోసం ఎంపిక చేసిన భవనాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

బషీరాబాద్: ఇంటర్ విద్యార్థుల రెండేళ్ల నిరీక్షణకు మోక్షం లభించింది. 2023లో బషీరాబాద్‌కు జూనియర్ కళాశాల మంజూరైంది. గతేడాది అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినా భవనం లేకపోవడం, లెక్చరర్లను నియమించకపోవడంతో విద్యార్థులను తాండూరు జూనియర్ కాలేజీలో చేర్పించారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం బషీరాబాద్ కళాశాలకు 8మంది ఫ్యాకల్టీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అడ్మిషన్లు ఊపందుకున్నాయి. మండల కేంద్రంలో దశాబ్దాలుగా ఇంటర్ కళాశాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం కళాశాలను మంజూరు చేసింది. రెండేళ్లయినా తరగతులు ప్రారంభం కాలేదు. దీంతో విద్యార్థులు నిరుత్సాహ పడ్డారు. గతేడాదిలో 34 మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందారు. అయితే ప్రభుత్వం లెక్చరర్లను నియమించకపోవడంతో విద్యార్థులను తాండూరు జూనియర్ కాలేజీలో చేర్చారు. ప్రస్తుతం సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడటంతో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌సీ తదితర కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటున్నారు. అధ్యాపకులు ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని భవనాన్ని కేటాయించారు. బుధవారం భవనాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, అజయ్‌ప్రసాద్, కళాశాల సిబ్బంది పరిశీలించారు. చిన్న చిన్న మరమ్మతులు చేస్తే తరగతులు నిర్వహించవచ్చని భావిస్తున్నారు.

కబ్జా కాకుంట



గాండ్లగూడెంలో మొద్దులకుంటను పూడ్చడానికి పోసిన మట్టి

- చెరువుల, కుంటల అన్యాక్రాంతంపై ఫిర్యాదులు
- అక్రమార్కులను కట్టడి చేయాలని అభ్యర్థన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రియల్టర్ల భూ దాహానికి ఖాళీ ప్రభుత్వ స్థలాలే కాదు.. చెరువులు, కుంటలు సైతం మాయమవుతున్నాయి. భగ్గున మండుతున్న ఎండలకు చెరువులు, కుంటలన్నీ ఎండిపోయాయి. కాల్వలు, కట్టలు, అలుగులు సహా శిఖం భూములు ఖాళీగా కనిపిస్తున్నాయి. దీంతో ఆ పక్కనే పట్టా భూములు కొనుగోలు చేసిన రియల్టర్లు కల్వర్టులు, కాల్వలను సైతం చదును చేసి తమ వెంచర్లలో కలిపేస్తున్నారు. వరదనీరు పారకుండా అడ్డుకట్టలు వేస్తూ.. రైతుల పొలాల మీదకు మళ్లిస్తున్నారు. చెరువులు, కుంటలపై ఎప్పటికప్పుడు నిఘా పెంచాల్సిన అధికార యంత్రాంగం అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కళ్ల ముందే కుంటల ఆనవాళ్లను చెరిపేస్తుండటంతో కొంతమంది రైతులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

హద్దులు దాటి..

జిల్లా వ్యాప్తంగా 2,132చెరువులు, కుంటలు 10, 946 ఎంఎఫ్‌టీ సామర్థ్యం కలిగి ఉన్నాయి. వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రభుత్వం వీటిలో ఏటా 1.20 కోట్ల చేప పిల్లలను వదులుతోంది. 400 టన్నుల కుపైగా దిగుబడి వస్తోంది. వేలాది మంది మత్స్యకారులు ఈ చెరువు లు, కుంటలనే నమ్ముకుని జీవిస్తున్నారు. వేసవిలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. బఫర్‌జోన్లు, ఫుల్ ట్యాంక్ లెవల్‌లోని నీరు పూర్తిగా ఇంకిపోయింది. ఇదే అవకాశంగా భావిస్తున్న కొంతమంది అక్రమార్కులు రాత్రికి రాత్రే మట్టి నింపుతున్నారు.

పెద్దకుంట కబ్జా

కడ్తాల్: మండలంలోని వంపుగూడ గ్రామ సర్వే నంబర్ 40లోని 'పెద్దకుంట'కు సంబంధించిన 1.12 ఎకరాల ఎఫ్‌టీఎల్ భూమిని కబ్జా చేసిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బుధవారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే పెద్దకుంటను సర్వే చేసి, హద్దులు నిర్ధారించాలని కోరారు. భూ భారతి సదస్సుల్లో భాగంగా బుధవారం ఆయా గ్రామాలకు హాజరైన అధికారులకు ఈవిషయమై ప్రజలు ఫిర్యాదులు అందించారు.

మొద్దులకుంటలో మట్టి

యాచారం: గాండ్లగూడెం సమీపంలోని మొద్దులకుంటను ఓ వ్యాపారి మట్టితో పూడ్చేసినట్లు గుర్తించిన పలువురు రైతులు బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డికి ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 313లోని పట్టా భూమి యజమానులు కొన్ని రోజులుగా మట్టితో కుంటను పూడ్చేస్తున్నారని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కనిపించకుండా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన ఆర్డీఓ వెంటనే పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అయ్యప్ప, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వెంటనే కుంట వద్దకు చేరుకున్న అధికారులుపోసిన మట్టిని తీసేయాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతగిరి: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లగూడ – చిట్టిగడ్డ రైల్వే స్టేషన్ల మధ్య ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు అధికారులు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. చేతి మణికట్టుకు నలుపు, పసుపు, ఎరుపు రంగు కలిగిన దారం ఉందని తెలిపారు. మృతుని ఒంటిపై నలుపు రంగు నైట్ ప్యాంట్, నలుపు రంగు టీ షర్ట్ ఉందన్నారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించి భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- పలువురికి స్వల్ప గాయాలు



గోరేపల్లి శివారులో రోడ్డు దిగిన బస్సు

యాలాల: స్టీరింగ్ రాడ్ పనిచేయకపోవడంతో ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. ఈ ఘటనలో పలువురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన బుధవారం మండం పరిధిలోని గోరేపల్లి శివారులో జరిగింది. దేవనూరు నుంచి తాండూరు వైపు సుమారు 50 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు వెళుతుంది. గోరేపల్లి శివారులోని మలుపు వద్ద స్టీరింగ్ రాడ్ పనిచేయకపోవడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దిగింది. ఈ ఘటనలో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గిరి తెలిపారు.

ఇంట్లో గంజాయి.. వ్యక్తి అరెస్టు



పోలీసుల అదుపులో మహ్మద్ మియా

తాండూరు టౌన్: గంజాయి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాండూరు ఎక్సైజ్ శాఖ ఇన్‌చార్జ్ సీఐ కె.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు తాండూరు ఎక్సైజ్ పోలీసులు, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామంలో మహ్మద్ మియా అనే వ్యక్తి ఇంట్లో సోదాలు నిర్వహించామన్నారు. అతను సేవించేందుకు కొనుగోలు చేసిన 125 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితున్ని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జ్ సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆదిశేషు రెడ్డి, నిజాముద్దీన్, సిబ్బంది భీమయ్య, రవి, కిషోర్, రాధిక, ఆసిఫాబేగం, రవికిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడ్డ తిరుపతయ్య

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు ముందు ఉన్న బైక్‌ను ఢీ కొని క్రింద పడి తీవ్రగాయాలైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గేటు దగ్గరలో ఘండిచెరువు గాదె కాలనీకి చెందిన తిరుపతయ్య కుల్కచర్ల వైపునకు వెళ్తున్న క్రమంలో ముందు ఉన్న వాహనాన్ని తగిలి అదుపుతప్పి క్రింద పడిపోయాడు. ఈ ఘటనలో తిరుపతయ్యకు తీవ్రగాయాలు అవ్వడంతో 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం గురించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం (సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం) కింద విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులకు(ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బుద్ధిస్ట్, పార్శీలు)నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7993357103, 8978964132లలో సంప్రదించాలన్నారు.

నేడు గౌతాపూర్‌లో రెవెన్యూ సదస్సు

తాండూరు రూరల్: మండలంలోని గౌతాపూర్, బిజ్వార్ గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిజ్వార్ అనుబంధ గ్రామం బొంకూర్ తోపాటు గౌతాపూర్ అనుబంధ గ్రామం గోపన్‌పల్లిలో సదస్సులు ఉంటాయని ఆయన తెలిపారు.

బడిబాటకు సన్నద్ధం

- రేపటి నుంచి 19 వరకు కార్యక్రమాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపే లక్ష్యంగా ముందుకు..



తిమ్మారెడ్డిపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా విద్యాశాఖ బడిబాట కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైంది. జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉపాధ్యాయులు బడిబయట బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ప్రగతి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై ప్రచారం చేయనున్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇటీవల మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కూడా ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా..

మండల వ్యాప్తంగా 45 ప్రభుత్వ పాఠశాలలు ఐదు ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 4,800 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను 20శాతం పెంచాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే సర్కారు బడులపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి నమ్మకం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయనున్నారు. నాణ్యమైన విద్య, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, భోజన వసతి వంటి వాటి గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేనున్నారు. అలాగే సాధించిన ఫలితాల గురించి వివరించనున్నారు.

విజయవంతం చేస్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులే ఉంటారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేస్తారు. అలాగే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, భోజన వసతి ఉంటుంది. వీటన్నింటినీ బడిబాట కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తాం. తద్వారా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం.

– వెంకటస్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎక్మామిడి, మాదిరెడ్డిపల్లి, మైతాప్ ఖాన్ గూడ, ఎల్లకొండ గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, సంక్షేమమే ధ్యేయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్న ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, ఎంపీఓ విజయ్ కుమార్, నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, రంగారెడ్డి, ఎండి రఫీ, ప్రకాష్, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విరమణ వయస్సు పెంచడం సరికాదు



మాట్లాడుతున్న వేణుగోపాల్

ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్ రూరల్: ఉద్యోగ విరమణ వయస్సు పెంచడం సరికాదని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేటలో ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ వయస్సు 61నుంచి 62సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వం ఆలోచించడం సరికాదన్నారు. దీంతో నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతారన్నారు. 2023 జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న 5డీఏలలో సత్వరమే మూడు డీఏలను ప్రకటించాలని, పెండింగ్‌లోని వివిధ బిల్లులు, సరెండర్ లీవ్‌లు, టీఎస్‌జీఎల్ఐ, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్‌ను వెంటనే మంజూరు చేయించాలని వివరించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

కుల్కచర్ల: మండల కేంద్రంలో గురువారం బాల్యవివాహం చేస్తున్నారనే సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి చేరుకొని రెండు కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కుల్కచర్లకు చెందని బాలిక(15)ను దాదాపూర్ గ్రామానికి చెందిన యువకుడికి ఇచ్చి గురువారం వివాహం చేయాలని భావించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు స్థానిక పోలీసులతో వారి ఇళ్లకు వెళ్లి పెళ్లి నిలిపివేయాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ మాట్లాడుతూ.. చిన్న వయస్సులో పెళ్లి చేస్తే బాలిక ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. బాల్యవివాహాలకు సహకరించినా నేరమని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



భానుప్రసాద్ (ఫైల్)

దుద్యాల్: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కుదరుమల్లలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కుర్వ నర్సిములు సునీత కుమారుడు భానుప్రసాద్(13). వారికి ఇంటికి దగ్గర్లోనే పశువుల పాక ఉంది. అక్కడ పశువులను చూడడానికి వెళ్లిన భాను ప్రసాద్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషదచాయలు అలుముకున్నాయి.

దివ్యాంగుల భవనాన్ని ప్రారంభించాలి

హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్



మాట్లాడుతున్న రాజేశ్

పరిగి: పరిగి పట్టణ కేంద్రంలో నిర్మించిన దివ్యాంగుల భవనాన్ని వెంటనే ప్రారంభించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పరిగి పట్టణ కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. 2018లో కేసీఆర్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం దృష్ట్యా దాదాపు రూ.7 లక్షల వ్యయంతో నిర్మించారని గుర్తు చేశారు. ఆ భవనాన్ని నేటికీ ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఈ విషయంలో చొరవ చూపి వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, సంఘం పరిగి నియోజకవర్గ ఇంచార్జ్ లక్ష్మయ్య, మండల అధ్యక్షుడు పసుల చంద్రయ్య, ఉపాధ్యక్షుడు నారాయణ, దోమ మండల అధ్యక్షుడు చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిలో ఇంటి నిర్మాణం

- అడ్డుకున్న అధికారిపై దూషణ
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న అధికారి శ్రీధర్

కుల్కచర్ల: అటవీ భూమిలో ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న ఆ శాఖ అధికారిపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెరువుముందలి తండా(కే)కు చెందిన కేతావత్ భాషా, అతని కుమారుడు నంద్యానాయక్ అటవీ భూమిలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ మంగవారం ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో కేతావత్ భాషా, నంద్యానాయక్ శ్రీధర్‌ను అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో శ్రీధర్ బుధవారం కుల్కచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

క్యాబ్ డ్రైవర్ వేధింపులు

సనత్‌నగర్: భర్తతో విడాకులు తీసుకున్న ఓ సింగర్‌ను క్యాబ్ డ్రైవర్ వేధింపులకు గురిచేశాడు. అతనితో సన్నిహితంగా ఉన్న ఫొటోలను తీసి కుటుంబ సభ్యులకు పంపుతానని, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే..బేగంపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన గాయనికి 2012లో వివాహం జరగ్గా ఒక బిడ్డకు జన్మనిచ్చింది. అయితే భర్తతో మనస్పర్థల కారణంగా 2024లో విడాకులు తీసుకుంది. విడాకులు తీసుకున్న విషయం తెలుసుకున్న బల్కంపేటకు చెందిన క్యాబ్ డ్రైవర్ ఉమామహేష్ గతంలో 2006లో ఆమెతో సన్నిహితంగా ఉన్నప్పుడు తీసిన ఫొటోలను ఆమెకు పంపించి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల తరలింపును అడ్డుకున్నందుకే..

- మాపై దాడి చేశారు
- డీఎస్పీకి యువకుల ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుల డిమాండ్



డీఎస్పీకి ఫిర్యాదు చేసి బయటికి వచ్చిన బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని అడ్డుకోవడంతో కొందరు వ్యక్తులు తమపై దాడి చేశారని పెద్దేముల్ మండలానికి చెందిన పలువురు యువకులు బుధవారం తాండూరు డీఎస్పీకి బాలకృష్ణా రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. పెద్దేముల్ మండలం జనగామ శివారులో మంగళవారం అర్ధరాత్రి ఓ అటవీ శాఖాధికారికి చెందిన ఫాంహౌస్ నుంచి 20 వరకు పశువులను డీసీఎంలో తరలిస్తుండగా, మంబాపూర్‌కు చెందిన రమేష్ సాగర్, రాము, అంజి అడ్డుకున్నారు. డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో డీసీఎం వాహనదారులతోపాటు మరి కొందరు యువకులపై దాడి చేశారు. దాడికి పాల్పడిన వారితో పాటు పశువుల తరలింపునకు సహకరించిన అటవీ శాఖ అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, పట్టణ కార్యదర్శి కిరణ్ డీఎస్పీని కోరారు. ఈ విషయమై తగు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు.

దాడి కేసులో నెల రోజుల జైలు

రూ.5వేల జరిమాన

పరిగి: బాత్రుం నిర్మించేందుకు వెళ్లిన తాపీ మేస్త్రీపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన కేసులో ఓ వ్యక్తికి నెల రోజుల జైలు, రూ.5వేల జరిమాన విధిస్తూ పరిగి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శిల్ప బుధవారం తీర్పు వెలువరించారు. మిట్టకోడూర్ గ్రామానికి చెందిన ఒంటెల రాములు తాపీమేస్త్రీ. 2019, ఆగస్టు 24వ తేదీన నస్కల్ గ్రామంలోని కాసుల అంజయ్య ఇంటికి బాత్రుం నిర్మించేందుకు వెళ్లారు. అక్కడ నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కాసుల నాగేశ్(42), కాసుల లోకేశ్(18) ఇద్దరు వ్యక్తులు గొడవకు దిగి తాపీమేస్త్రీపై కంకర రాయితో దాడి చేసి గాయపర్చారు. దీంతో ఈ విషయం గురించి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేశారు. బుధవారం వాదోపవాదనలు విన్న కోర్టు కాసుల నాగేశ్‌కు ఒక నెల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.5వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు.

పదకొండేళ్లు సుపరిపాలనే

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ
- నరేంద్రమోదీ ప్రపంచానికే ఆదర్శ నాయకుడు



మాట్లాడుతున్న ఆకుల విజయ

అనంతగిరి: ప్రధాని నరేంద్రమోదీ పదకొండేళ్ల సుపరిపాలన అందించారని, ప్రపంచానికి ఆదర్శ నాయకుడని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ అన్నారు. బుధవారం వికారాబాద్‌లో భారత ప్రధాని నరేంద్రమోదీ పాలన 11సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ ఇచ్చిన నెల రోజుల కార్యాచరణపై ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నెలరోజులు పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. 11 సంవత్సరాలు బీజేపీ చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా, మండల స్థాయిలో కార్యక్రమ ఇంచార్జిలను నియమించాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ పాలన అవినీతిరహిత పాలన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్, కార్యక్రమ ఇంచార్జి శేరి శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సదానందారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు శివరాజు, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, సీనియర్ నాయకులు ఈశ్వరప్ప, వడ్లనందు, సుచరితా రెడ్డి, సాహు శ్రీలత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

పోక్సో చట్టం కింద నిందితుడి అరెస్టు

బంజారాహిల్స్: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతితో సన్నిహితంగా ఉన్న తర్వాత...మరో యువతిని వలలో వేసుకున్న ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... బిహార్‌కు చెందిన సునీల్‌యాదవ్ గచ్చిబౌలిలోని హైహోమ్ బుజా అపార్ట్‌మెంట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ యువతి బతుకుదెరువు నిమిత్తం ఏడు నెలల క్రితం హైదరాబాద్‌కు రాగా ఆమెకు సునీల్ యాదవ్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన సునీల్ తరచూ ఆమెను బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లోని దేవరకొండ బస్తీలో ఉన్న తన స్నేహితుడి గదికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇటీవల సునీల్ మరో యువతితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండడాన్ని గమనించిన బాధితురాలు ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నించి గొడవ పడి తనను పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. అందుకు నిందితుడు నిరాకరించడంతో తాను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సునీల్‌యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్



కొడంగల్: మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్: భూ భారతితో భూ వివాదాలు పరిష్కారం అవుతాయని తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తహశీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే తెలియజేయండి

దుద్యాల్: భూ భారతి చట్టం రైతులకు చుట్టంలాంటిదని తహసీల్దార్ కిషన్ అన్నారు. ఈర్లపల్లి గ్రామంలో రైతు సదస్సులో మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్నా, ఫిర్యాదులు చేయాలన్నారు. ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్ఐ నవీన్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఫకీరప్ప, రికార్డు అసిస్టెంట్ ఊషప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు..

కుల్కచర్ల: భూ భారతి సదస్సులతో రైతులకు మేలు చేకూరనుందని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి అన్నారు. పుట్టపహాడ్ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ..భూములకు సంబంధించిన సమస్యలపై అవగాహన లేకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. దీంతో సమస్యలను నేరుగా అధికారులకు చెప్పుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. డిప్యూటి తహశీల్దార్ చంద్రశేఖర్, గిర్దవరులు ఖాజ, రవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పనిష్కారానికే..

బంట్వారం: భూ సమస్యల పరిష్కారినికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ మహేష్ అన్నారు. సుల్తాన్‌పూర్, నూరుల్లాపూర్ సదస్సులో 26 దరఖాస్తులను డీటీ మహేశ్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాంగోపాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోట్‌పల్లి మండలంలో..

కోట్‌పల్లి మండలంలోని ఇందోల్, ఒగులాపూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 11 దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

రెవెన్యూ సదస్సుకు దరఖాస్తుల వెల్లువ

యాలాల: భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ వెంకటస్వామి తెలిపారు. చెన్నారంలో 3, ఎన్కెపల్లిలో 1, నాగసముందర్‌లో 2 వచ్చాయన్నారు. డీటీ కిరణ్‌కుమార్, ఆర్ఐ వేణు, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: కోల్కుంద, రావులపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 10 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్, అర్ఐలు గోవర్ధన్, సరిత, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తాండూరు రూరల్: రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు తహశీల్దార్ తారాసింగ్ అన్నారు. వీరశెట్టిపల్లి, గోనూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గోనూర్‌లో-11, వీరశె ట్టిపల్లిలో ఎలాంటి దరఖాస్తులు రాలేదని తహశీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ లలిత, ఆర్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

దోమ: ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ గోవిందమ్మ అన్నారు. పోతిరెడ్డిపల్లి, బట్లచందారం గ్రామంలో నిర్వహించిన సదస్సులో 19 దరఖాస్తులు స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ నర్సింహులు, ఆర్ఐలు సుదర్శన్, రాంచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ పర్వేజ్, జూనియర్ అసిస్టెంట్ సరిత, యాదయ్య, మోహన్, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు



యాలాల: చెన్నారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ వెంకటస్వామి